RNI No: APTEL/2018/76747

PAGE: 03
కల్తీకి చెక్..



# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | ఆదివారం | సంపుటి: 9 | సంచిక: 227 | పేజీలు: 04 | వెల: 5 /- | 16 ఆగస్టు 2026 |



# జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి

## న్యూఢిల్లీ తెలంగాణ ప్రభుత్వ పత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు ఏపీ జితేందర్ రెడ్డి

- గూడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచుతూ క్యాబినెట్ ఆమోదం
- అభివృద్ధి, సంక్షేమమే ప్రధానంగా సుపరిపాలన
- తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం
- గద్వాల పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





అలంపూర్, నవతరం: అభివృద్ధి, సంక్షేమమే ప్రధానంగా సుపరిపాలన అందిస్తూ, జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని న్యూఢిల్లీ తెలంగాణ ప్రభుత్వ పత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం గద్వాల పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన వేడుకల్లో ఏపీ జితేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు హృదయ పూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గద్వాల, ఆలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, తదితర అతిథులతో కలిసి మొదట దేశ నాయకుల చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గీతం తో పాటు వందేమాతరం, జాతీయ గీతాలను ఆలపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ జీపులో ముఖ్య అతిథితో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రసంగిస్తూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ఒక భాగం. మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టినందున జిల్లాలో ఇప్పటివరకు 10 థీమ్ లు పరిశుభ్రత, ఆరోగ్యం, రహదారి భద్రత అరైవ్, అలైవ్, సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత నో-డ్రగ్స్ ప్రచారం, రైతు సంక్షేమం, విద్యా, ఉపాధి అవకాశాలు, యువత, క్రీడలకు ప్రోత్సాహం, మహిళా శిశు సంక్షేమం మరియు పర్యావరణ కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి పనుల వివరాలు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి సమావేశాలలో ప్రజలకు వివరించడం జరిగిందన్నారు.

### ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో కృషి

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకములో భాగంగా జిల్లాలో ఇప్పటివరకూ 3కోట్ల 21లక్షల 76వేల మంది మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. దీని ద్వారా మహిళలకు రూ.123.78 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. "రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని" మరింత పకడ్బందీగా అమలు చేయడంతో పాటు, ఈ పథకం క్రింద పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఈ పథకంలో భాగముగా ఇప్పటివరకు 16,686 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించామన్నారు. ఇందుకు గాను రూ.47.97 కోట్ల వ్యయము చేయడము జరిగిందన్నారు.

దేశ వ్యవసాయ చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిది నెలల కాలంలో జిల్లాలో 58,113 రైతులకు సంబంధించి రూ.513.99 కోట్ల పంట రుణమాఫీ చేసి రుణ విముక్తులను చేయడం జరిగిందన్నారు. రైతుకు పెట్టుబడి సాయం పెంచి రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. జిల్లాలో 2026-27 వానాకాలం సీజనులో 1,72,417 మంది రైతులకు రూ.263 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడము జరిగిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలలో నగదు జమచేయడం జరుగుతోందన్నారు. ఈ యాసంగి సీజనుకు గాను 75 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 7091 మంది రైతుల నుండి 50,725 మెట్రిక్ టన్నుల వరి ధాన్యమును కొనుగోలు చేసి రూ.121.18 కోట్లు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిందని వివరించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలలో, అమలు చేస్తున్న వివిధ పథకాలలో ఉత్తమ పనితీరు ర్యాంకింగ్ లో జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో ఐదవ స్థానముతో ఇటీవల ప్రతిభ చాటిందన్నారు.

### అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాల అమలు

ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ 2026కు గాను జిల్లాలో 1,90,671 రేషన్ కార్డుదారులలో 6,76,293 మందికి మూడు నెలలకు 12,721 మెట్రిక్ టన్నుల ఉచిత రేషన్ సన్న రకం బియ్యాన్ని 337 రేషన్ దుకాణాల ద్వారా లబ్దిదారులకు ముందుగానే పంపిణీ చేయడము జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో ఆగస్టు 15 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో నిరుపేదలకు నియోజక వర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రెండవ దశలో గుడిసెల్లో నివసించే వారు పక్క గృహాలు నిర్మించుకునేందుకు నియోజక వర్గానికి 2,000 చొప్పున ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి లబ్దిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. జిల్లాలో 6795 ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంనకు మంజూరు ఇవ్వగా ఇప్పటివరకు 649 ఇందిరమ్మ ఇళ్ళు పూర్తి కాగా ఇందులో 388 ఇందిరమ్మ ఇళ్ళలో లబ్ధిదారులు గృహ ప్రవేశము చేశారన్నారు. 5420 ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయన్నారు. "500 రూపాయలకే వంట గ్యాస్ పథకం" క్రింద జిల్లాలో ఇప్పటివరకు 95,752 మందికి లబ్ధి చేకూర్చడము జరిగిందన్నారు. దీనికి గాను ప్రభుత్వం రూ.19.37 కోట్ల సబ్సిడీ అందజేయడము జరిగిందన్నారు. "గృహజ్యోతి పథకం" ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకూ 88,190 కుటుంబాలకు సంబంధించిన 21,23,838 జీరో బిల్లులకు సంబంధించి రూ.57.09 కోట్ల సబ్సిడీని లబ్దిదారులకు అందచేయడము జరిగిందన్నారు. సామాజిక భద్రతలో భాగముగా "చేయూత పెన్షన్ పథకము" క్రింద జిల్లాలో 66వేల 548 మంది లబ్దిదారులకు ప్రతి నెల రూ.16కోట్ల 23లక్షల 67వేల విలువైన పెన్షన్లు పంపిణీ చేయడము జరుగుతుందన్నారు. కొత్త పెన్షన్ ల దరఖాస్తుల స్వీకరణ 31 ఆగష్టు 2026 వరకు జిల్లాలోని అన్ని మండలాలలో, మున్సిపల్ కార్యాలయాలలో జరుగుతుందన్నారు. జిల్లాలో 311 గ్రామ సంఘాల పరిధిలో 7971 స్వయం సహాయక సంఘాలలో 85,097 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరములో 7222 స్వయం సహాయక సంఘాలకు రూ.212.65 కోట్ల బ్యాంక్ రుణ లింకేజీ లక్ష్యంగా ఇప్పటివరకు 593 స్వయం సహాయక సంఘాలకు రూ.66.03 కోట్ల రుణాలను మంజూరు చేయడము జరిగిందని పేర్కొన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలులో జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానములో ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 552 మంది లబ్ధిదారులకు రూ.1.10 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మిగత 175 మంది లబ్ధిదారులకు రూ.35 లక్షల పరిశీలన తర్వాత ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగముగా మొదటి విడతలో జిల్లాకు రూ.4.68 కోట్ల వ్యయముతో 13 బస్సులను కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందన్నారు.

### అభివృద్ధి పనుల్లో కూడా జోగులాంబ గద్వాల జిల్లా ముందడుగు

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19టీఎంసీల నుంచి 15టీఎంసీలకు పెంచేందుకు నిర్ణయము తీసుకుంటూ ఈ నెల 14న జరిగిన క్యాబినెట్ సమావేశములో మంత్రివర్గం ఆమోదము తెలిపిందన్నారు. అలాగే గట్టు ఎత్తిపోతల ప్రాజెక్ట్ సామార్థ్యాన్ని 1.3టీఎంసీల నుంచి 3.0టీఎంసీలకు పెంచుతూ రూ.1,781కోట్లతో ప్రాజెక్ట్ రీ-డిజైన్ కు కూడా క్యాబినెట్ నిర్ణయించిందన్నారు.

మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణ పనులను కూడా వేగవంతం చేసి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. జిల్లాలో రూ.376.25 కోట్ల నిధులతో నిర్మించిన వివిధ విద్యుత్ సబ్ స్టేషన్లను గత నెలలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించుకోవడమే కాక రైతులకు మంజూరైన ట్రాన్స్ఫార్మర్లను అందజేశామన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్లు, గట్టు మండలం రాయపురం వద్ద రూ.48 కోట్ల నిధులతో సబ్స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా హామ్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.339.39 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవలే ధరూరు వద్ద శంకుస్థాపన చేశారన్నారు. గద్వాలలో మెడికల్ కళాశాల అకాడమిక్ బ్లాక్ తో పాటు వసతిగృహాల నిర్మాణానికి రూ.128కోట్ల నిధులు మంజూరు చేసినందున పనులు కూడా ప్రారంభ మయ్యాయని తెలిపారు. గద్వాలలో రూ.34.20 కోట్ల నిధులతో నర్సింగ్ కళాశాల భవనాలు, రూ.23.75 కోట్ల నిధులతో క్రిటికల్ కేర్ యూనిట్ భవనాలను నిర్మించగా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. గద్వాలలో నూతనంగా ఆర్డిఓ కార్యాలయ భవన నిర్మాణానికి, రెండు నియోజకవర్గాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలతో పాటు కేటీ దొడ్డి, ఉండవెల్లి రాజోలి మండలాల్లో తహసిల్దార్ కార్యాలయాల భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సంవత్సర సవరణ కార్యక్రమంలో భాగముగా ఓటర్ల ఎనుమరేషన్ 87.31 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా ఉమ్మడి జిల్లాలో జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్ఐఆర్ లో మొదటి స్థానములో ఉందని పేర్కొన్నారు. జనాభా గణన 2027 లో భాగముగా ఇండ్ల గణనను జిల్లాలో విజయవంతముగా పూర్తి చేయటం జరిగిందన్నారు.

అక్షరాస్యతలో జోగుళాంబ గద్వాల జిల్లాలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతము చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగముగా ఈ ఏడాది జూన్ లో పాఠశాలలు ప్రారంభానికి ముందే అన్ని విద్య సంస్థల ప్రధాన ఉపాధ్యాయులకు ఎర్రవల్లిలో జ్ఞానదీప్తి పేరుతో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడము జరిగిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో అధనముగా 120 మంది విద్య వాలంటీర్లను నియమించారన్నారు. జిల్లాకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటు రెండు నియోజవర్గాలలో తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ మంజూరు కావడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రతి సోమవారము ప్రజావాణి కార్యక్రమమును జిల్లా స్థాయిలో, రెవిన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహిస్తుండగా ప్రస్తుతం మండల స్థాయిలో ఎంపీడీవోల ఆద్వర్యములో కూడా నూతనంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలకు స్వీకరించేదుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇవే కాక జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించి అనేక అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నందున నడిగడ్డ ప్రాంత సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇలా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తూ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తూ, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో ముందుకెళ్తోందన్నారు. అనంతరం వివిధ విద్యాసంస్థల చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అతిధులు విద్యార్థులను ప్రశంసిస్తూ బహుమతులను అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అతిధులచే ప్రశంసా పత్రాలు బహుకరించారు. అలాగే జిల్లాలోని 617 మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన రూ.69 కోట్ల విలువైన చెక్కును అతిధులు పలువురు సంఘాల ప్రతినిధులకు అందజేశారు. వేడుకలను పరిష్కరించుకొని వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన స్టాళ్లను అతిధులు పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు బర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ సరిత తిరుపతయ్య, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నేతలు, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

---

## తెల్ల హరికృష్ణ

### ఆధ్వర్యంలో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు



కూకట్ పల్లి, ఆగస్టు 15 (నవతరం): మన దేశ 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం 9 గంటలకు కూకట్ పల్లి బగ్ అమీర్ వార్డ్ ఆఫీస్ బస్తి దావకాన ఆవరణలో రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బగ్ అమీర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే జాతీయ గీతాన్ని ఆలపించారు, అనంతరం మిఠాయిలు, నోట్ పుస్తకాలు, పెన్, పెన్సిల్, ఎరేజర్, స్కేల్ లను విద్యార్థులకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులకు ప్రిన్సిపల్ లక్ష్మణ్ కి, ఉపాధ్యాయురాళ్లకు, గ్రామస్తులు దండే అశోక్ కుమార్, ఆకుల వీరస్వామి, ఆకుల బాలకృష్ణ, ఆకుల మహేష్ కుమార్, కృష్ణ గౌడ్, ఆశా వర్కర్స్, మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు అందరికీ ధన్యవాదములు తెలుపుతున్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విలేకరి ఇల్లు దగ్ధం

- 5 వేల ఆర్థిక సహాయం అందజేసిన TWJF అధ్యక్షులు ఎర్ర యాకన్న
- ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తినష్టం



కూకట్ పల్లి, ఆగస్టు15 (నవతరం): కూకట్పల్లి త్రినేత్రం రిపోర్టర్ గుండా మనోహర్ ఇల్లు శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమై సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం మిగతా 4లో..

# “ఐదు కాళ్ల బిల్లులు కూలాయి - ప్రజాగళం గెలిచింది”

- “వర్షాకాల సభలో కేంద్రానికి చేదు అనుభవం - ప్రజాస్వామ్యం పైచేయి సాధించింది”
- “19%తో ముగిసిన లోక్‌సభ... బుల్డోజర్ అజెండా బొక్కబోర్లా”
- “బొద్దింకల పేరుతో యువతను అవమానిస్తే... యువతే కేంద్రాన్ని వణికించింది”
- ప్రముఖ సామాజికవేత్త శిరిగిరి వరదరాజ తో **‘నవతరం’** దినపత్రిక ప్రత్యేక ఇంటర్వ్యూ



“అన్నీ మన చేతుల్లోనే ఉన్నాయి” అని ధీమాగా మొదలెట్టిన కేంద్రానికి వర్షాకాల సమావేశాలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. రాజ్యసభ 39%, లోక్‌సభ 19% పనితీరుతో సభ ముగిసింది. “ఒకే దేశం ఒకే ఎన్నిక” నుంచి నియోజకవర్గాల పునర్విభజన వరకు కేంద్రం తెచ్చిన అజెండా అంతా గాలిలో కలిసిపోయింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం ముందు ఈ పరాభవం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. ఈ నేపథ్యంలో ప్రముఖ సామాజికవేత్త శిరిగిరి వరదరాజ తో నవతరం ప్రతినిధి ప్రత్యేకంగా మాట్లాడారు.

**1. “కేంద్రం అంచనాలు తలకిందులయ్యాయి”**

**నవతరం :** కేంద్రం ఈ సారి సభను ఎలా నడపాలని భావించింది? ఎందుకు విఫలమైంది?

**సిరిగిరి వరదరాజు :** నియోజకవర్గాల పెంపు, “ఒకే దేశం ఒకే ఎన్నిక” వంటి కీలక రాజ్యాంగ బిల్లులను చాపచుట్టేయాలని కేంద్రం ప్లాన్ చేసింది. ప్రధాని మోడీ నాయకత్వం, అమిత్ షా చాకచక్యం, చంద్రబాబు మద్దతు, శరద్ పవార్ కొత్త స్నేహం.. అన్నీ కలిసి వస్తాయని ధీమా. కానీ సభా వ్యవహారాల మంత్రి కిరణ్ రిజ గణాంకాలే నిజం చెప్పాయి - రాజ్యసభ 39%, లోక్‌సభ 19%. బుల్డోజర్ తో రాజ్యాంగాన్ని నలిపేయాలన్న పేరాశ సభ లోపల, బయట ప్రతిఘటనతో కుప్పకూలింది. ఇది నిరుత్సాహం కాదు, ఇది ప్రజాస్వామ్య విజయం.

**2. “స్వాతంత్ర్య దినోత్సవ కానుక - బొద్దింకల భేరి”**

**నవతరం :** యువత ఉద్యమాలను మీరు ఎలా చూస్తారు?

**శిరిగిరి వరదరాజు:** “బొద్దింకలు” అని ఎగతాళి చేశారు. అదే యువత “జైల్ భరో” అంటూ ఆగస్టు 10న పది లక్షల మందితో వీధుల్లోకి వచ్చింది. ఇదే అసలైన 79వ స్వాతంత్ర్య కానుక. “వందేమాతరం” పేరుతో దేశభక్తి పాఠాలు చెప్పేవాళ్లు, తమిళనాడు “తమిళతల్లి వందనం” అనగానే ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కేరళలో సర్క్యులర్ ఇచ్చి వెనక్కి తీసుకున్నారు. “దేశభక్తి అంటే గొంతు పెంచడం కాదు, ప్రశ్నించడం” అని యువత నిరూపించింది.

**3. “బడ్జెట్ సభ - తొత్తు సభ. ఇది - ప్రతిఘటన సభ”**

**నవతరం :** గత సమావేశాలకు ఇప్పటికి తేడా?

**సిరిగిరి వరదరాజు :** జనవరి-ఏప్రిల్ బడ్జెట్ సభ పూర్తి ఏకపక్షం. ట్రంప్ “భారత్ తో FTA అయింది” అని ప్రకటిస్తే ఇక్కడ “అవును సార్” అన్నారు. పార్లమెంటుకు సమాచారం కూడా ఇవ్వలేదు. రాహుల్ గాంధీ డోక్లామ్, గల్వాన్ పై నిజాలు మాట్లాడితే “అబోధ బాలక్” అన్నారు. ప్రతిపక్ష మహిళా ఎంపీల నిరసనను సాకుగా చూపి రాష్ట్రపతి ధన్యవాద తీర్మానం ప్రసంగం రద్దు చేశారు. అది “ఏకపక్ష ఏకలవ్య సభ”. ఇప్పుడు “ఏకపక్షం” కుదరలేదు. “ప్రశ్నిస్తే దేశద్రోహం” అనే రోజులు పోయాయి. “ప్రశ్నించడమే దేశభక్తి” అనే రోజులు వచ్చాయి.

**4. “కుటిల వ్యూహాలు - కుప్పకూలిన కుర్చీలు”**

**నవతరం :** కేంద్రం భయపడిందా?

**శిరిగిరి వరదరాజు :** “భయపడింది” అనడం చిన్న మాట. 2024 ఎదురుదెబ్బ తర్వాత ధీమాగా ఉన్న బీజేపీ-ఆరెస్సెస్ ను “బొద్దింకల యుద్ధం” హడలగొట్టింది. ధర్మేంద్ర ప్రధాన్ సీటు ఊడింది. ప్రధాని నిద్రపోయి “యువత కోసం వీడియో” తీయాల్సి వచ్చింది. RSS బాస్ దాకా “యువత సమావేశాలు” పెట్టాల్సి వచ్చింది. “లీకేజీ బిల్లు” ఆగమేఘాల మీద వచ్చింది. కానీ JNUలో ఆదివాసీ పుస్తక చర్చకు అడ్డు, TISSలో విద్యార్థులపై శిక్షలు, జంతర్ మంతర్ కేసులు మాత్రం ఆపలేదు. “మాట మార్చారు కానీ మనసు మార్చుకోలేదు”.

**5. “ఐదు కాళ్లతో వచ్చిన బిల్లులు - ఐదింటికీ కాళ్లు విరిగాయి”**

**నవతరం :** ఏ బిల్లులు ఆగాయి?

**శిరిగిరి వరదరాజు :** అప్రజాస్వామికమైన 5 బిల్లులు సభ ముంగిట్లోనే కుప్పకూలాయి. “ఒకే దేశం ఒకే ఎన్నిక”, “మహిళా రిజర్వేషన్ల పేరుతో నియోజకవర్గాల కత్తెర”, “FCRA ఉరి”, “వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ పేరిట విద్యా గుత్తాధిపత్యం”, “30 రోజుల జైలు = పదవి గో” బిల్లు. “రాజ్యాంగాన్ని చాపచుట్టేయాలన్న” కుట్ర తాత్కాలికంగా ఆగింది. కానీ గనుల సవరణ, సహకార సంస్థల కేంద్రీకరణ, వందేమాతరం విస్తరణ సహా 12 బిల్లులు మాత్రం “దొడ్డిదారిన” చర్చ లేకుండా పాస్ చేశారు.

**6. “సభలో సంస్కారం చచ్చింది - సభ్యత ఖూనీ అయింది”**

**నవతరం :** వివాదాస్పద ఘటనలపై?

**శిరిగిరి వరదరాజు :** జంతర్ మంతర్ నిర్బంధంపై అమిత్ షా ప్రకటన ఇవ్వలేదు. అయోధ్య రామమందిరం నిధుల గల్లంతు చర్చకు ఒప్పుకోలేదు. రాజ్యసభలో సీపీఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిటాస్ ను బీజేపీ ఎంపీ “లుంగీవాలా” అని అవమానించడం అసహనానికి పరాకాష్ట. చైర్మన్ మందలించాల్సి వచ్చింది. రామ్ లీలా మైదానాన్ని “శ్రీరామ్ సేన” శుద్ధి చేయడంపై ఖర్గే ప్రశ్నించగా జేపీ నడ్డా “సారీ” అన్నారు. “అధికారం తలకెక్కితే ఇలాగే ఉంటుంది”.

**7. “తెలుగు నేతలకు రెండు నాలుకలు”**

**నవతరం :** తెలుగు రాష్ట్రాల పాత్ర?

**సిరిగిరి వరదరాజు :** స్పీకర్ ఓం బిర్లా ప్రకటన లేకుండా సభ ముగిసింది. వీడ్కోలు విందుకు ప్రతిపక్షాలు వెళ్లలేదు. “ఢిల్లీలో ఒక మాట, ఇక్కడ ఒక మాట”. ఏపీలో పవన్ కళ్యాణ్ “మోడీ గొప్ప” అని పొగిడి, జెన్-Zని తిట్టి చేతులు కాల్చుకున్నారు. BRS, YCP మీడియాలు “సభ వేస్ట్, ఉత్పాదకత లేదు” అంటూ కేంద్రానికి వత్తాసు పాడాయి. “అధికారం ఉన్నప్పుడు స్నేహం, లేనప్పుడు విమర్శ” - ఇదే వీరి రాజకీయం.

**8. “విదేశాల ముందు తలవంచడం - దేశం ముందు గొప్పలు”**

**నవతరం :** ట్రంప్ వ్యవహారం, రాహుల్ వ్యాఖ్యలపై?

**శిరిగిరి వరదరాజు :** “140 కోట్ల ప్రజల తరపున థాంక్స్ ట్రంప్” అన్నారు. కానీ పార్లమెంటుకు చెప్పలేదు. “ఒక ఫోన్ చేస్తే అన్నీ అవుతాయి” అని అమెరికా అధికారులు అన్నారంట. “ఇది స్వతంత్ర భారతమా లేక స్వతంత్ర కాలనీనా?” అని ప్రశ్నించే దమ్ము కూడా పాలకులకు లేదు. ఇప్పుడు రాహుల్ గాంధీ మోడీ విదేశీ ఆలింగనాలపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ పెద్దది చేసే పథకరచనలో ఉంది. కానీ అసలు ప్రశ్నల నుంచి తప్పించుకునే చిట్కాలవి.

**9. “పోరాటమే పరిష్కారం”**

**నవతరం :** ఈ సమావేశాల భవిష్యత్ ప్రభావం ఏమిటి?

**శిరిగిరి వరదరాజు:** రాజకీయంగానూ, రాజ్యాంగపరంగానూ బీజేపీ-ఆరెస్సెస్ భారీ పథకాలకు బ్రేకు పడింది. “ఓటుతో గెలిచాం కాబట్టి ఏదైనా చేయొచ్చు” అనుకుంటే కుదరదని ఈ సభ నిరూపించింది. “ప్రజలు గొంతెత్తితే పాలకులు వణుకుతారు”. విద్య, ఉపాధి, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం ఆగకూడదు. “స్వాతంత్ర్యం అంటే జెండా ఎగరేయడం కాదు... ప్రతి పేదవాడికి గౌరవం దొరకడమే”. ఆ పోరాటం ఇప్పుడే మొదలైంది.

## ఉత్తమ ' సేవ' కు గుర్తింపు

- మంత్రి, కలెక్టర్, సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న కానిస్టేబుల్ కన్నాబాబు

శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు పారదర్శకమైన వేగవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న మహారాణిపేట పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బి.కన్నబాబు ఉత్తమ ‘సేవ’కు గుర్తింపుగా ప్రశంస పత్రం వరించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి అనగాని సత్య ప్రసాద్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, విశాఖ సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా కన్నబాబు ఈ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. 2003 వ సంవత్సరం బ్యాచ్ కు చెందిన కన్నబాబు పోలీస్ కఠిన సేవా పతకం, డీజీపీ కమెండేషన్ అవార్డులను కూడా అందుకొని ఘనత సాధించారు. ప్రస్తుతం

మిగతా వార్తా కొరకు పక్కనే ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..



తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు.. ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు

# కల్తీకి చెక్..



- ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- 'టీజీ సేఫ్' పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం
- ఆహార, ఔషధాల కల్తీని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం
- నియంత్రణ వ్యవస్థల ఆధునికీకరణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, నవతరం: తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది.

'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది.

ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

## రేపటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

- సోమవారం నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి
- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు
- మెగా డీఎస్సీ, ఫీజ రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో చర్చకు వైసీపీ వ్యూహం

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది.

మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

### స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా




సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

మిగతా వార్త కొరకు కింది QR CODE స్కాన్ చేయండి

## ప్రియురాలిని చంపి తగలబెట్టిన ప్రియుడు

# భర్తతో గర్భం దాల్చిందని..



నాగర్‌కర్నూల్, నవతరం: వెల్దండ మండలంలో దారుణ ఘటన వెలుగు చూసింది. భర్తను వదిలేసి తనతో వస్తానని చెప్పి రాకపోగా, మరోవైపు గర్భం దాల్చిందనే కోపంతో ఓ ప్రియుడు తన ప్రియురాలిని అత్యంత పాశవికంగా హతమార్చాడు. సాక్ష్యాలు లేకుండా చేసేందుకు మృతదేహానికి నిప్పంటించి దహనం చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొట్ర గ్రామానికి చెందిన అనూష (24), అదే గ్రామానికి చెందిన నారమళ్ల చెన్నయ్య ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు మోక్షిత్ ఉన్నాడు. అనూష కల్వకుర్తిలో ఒక లేడీస్ కార్నర్‌లో, ఆమె భర్త ఒక హోటల్‌లో పనిచేస్తున్నారు.

బుధవారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి బయలుదేరిన అనూషను రాములు తన బైక్‌పై ఎక్కించుకుని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై కొట్ర శివారులోని తన చిన్నాన్న పొలంలోకి తీసుకెళ్లాడు. కాసేపటి తర్వాత శ్రీనును కూడా అక్కడకు పిలిపించుకుని, ఇద్దరూ కలిసి అనూష మెడకు చున్నీ బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై వడ్డెరోనికాళ్ల సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తరలించి, ముందే సిద్ధం చేసిన కట్టెలపై ఉంచి డీజిల్ పోసి దహనం చేశారు. ఆ తర్వాత ఇళ్లకు వెళ్లి స్నానాలు చేసి, మృతదేహం పూర్తిగా కాలిందో లేదో అని మళ్లీ వచ్చి పరిశీలించి నేరుగా వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు.

గత నాలుగేళ్లుగా అనూషకు అదే గ్రామానికి చెందిన శ్యాంపూరి రాములుతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. భర్త చెన్నయ్యకు వేరే మహిళతో సంబంధం ఉందని, అతన్ని విడిచిపెట్టి త్వరలోనే తనతో వచ్చేస్తానని అనూష చెబుతూ కాలయాపన చేస్తుండటంతో రాములు ఆమెతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో అనూష రెండు నెలల గర్భిణి అని తెలియడంతో పాటు, భర్తతోనే కాపురం చేస్తోందన్న కక్షతో ఆమెను అడ్డు తొలగించుకోవాలని రాములు నిర్ణయించుకున్నాడు. ఈ హత్యకు తన అల్లుడైన నాయిని శ్రీనుతో కలిసి ఒక పక్కా పథకం రచించాడు.

మరోవైపు రాత్రి చాలా సమయమైనా అనూష ఇంటికి రాకపోవడంతో భర్త చెన్నయ్య కల్వకుర్తి, వెల్దండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు రాములు ఇచ్చిన సమాచారంతో అర్ధరాత్రి 12 గంటలకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పించారు. అప్పటికే అనూష మృతదేహం పూర్తిగా కాలిపోయి కేవలం ఎముకలు మాత్రమే మిగిలాయి. నిందితులు రాములు, శ్రీనులపై హత్య కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తల్లిని కోల్పోయిన చిన్నారి మోక్షిత్ భవిష్యత్తుపై ఇరువర్గాల కుటుంబసభ్యుల మధ్య వాగ్వాదం జరగగా, నిందితుడు రాములు కుటుంబసభ్యులు బాలుడి పేరుపై కొంత నగదు డిపాజిట్ చేయడానికి అంగీకరించారు.

## కళ్లన్నీ రాయదుర్గం పైనే?

- వజ్రాల గని కంటే విలువైనది అంటూ నమ్మకం?
- అది పెద్దల గద్దలకైనా.. ప్రభుత్వ వేలానికైనా?
- ప్లాట్ 1, 2 వివాదాలు మళ్లీ కోర్టు వద్దకే
- మొన్న వేలంలో ఎస్బీఐ బ్యాంకు భూమి పంచాయితీ కూడా అక్కడికే
- అంతకుముందు ఈ భూములపై ఎన్నో అనుమానాలు
- వంశీరాం, అపర్ణకు ఇచ్చిన బడా నిర్మాణ స్కాం కూడా ఇక్కడే?
- అడ్డుకుంటోంది ఎవరు?.. వారి దురుద్దేశం ఏంటి?




హైదరాబాద్, నవతరం: దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ దివాలా తీసినా హైదరాబాద్ రాయదుర్గంలో మాత్రం ఆసియా ఖండంలోనే అత్యధిక ధర పలికే ఇండస్ట్రియల్ ప్రాంతంగా ఉంది. నాలెడ్జ్ పార్క్ హబ్‌కు చుట్టూ మైండ్ స్పేస్‌తో పాటు మరెన్నో సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఓల్డ్, న్యూ హైదరాబాద్‌తో పాటు ఓఆర్ఆర్ కనెక్టివిటీ ఉన్నాయి. లేక్ , హిల్ వ్యూ ఉండటంతో ఈ భూముల పైనే అందరి కళ్లు పడ్డాయి. గౌర వెంచర్స్ వాళ్లు రూ.237 కోట్లకు ఎకరం కొనుగోలు చేశారు. అది ఎస్బీఐది అని తేలింది. వాళ్లు కోర్టును ఆశ్రయించడంతో సీఎం రేవంత్ సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో రాజీకొచ్చారు. మూడు వారాలు స్టే దొరికింది.

**ఇవాళ్టి కేసు ఇదే?**

ఈ నెల 1న ఈ రాయదుర్గం భూములు అమ్ముకునేలా ప్రభుత్వం వేలం వేసింది. ఇందుకు ప్లాట్ వన్ 17న, ప్లాట్ 2 , 21న వేలం వేసేలా సర్వే నెంబర్ 83/1 లో నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై పిటిషనర్ హెరిటెజ్ ప్రీసింక్ట్ లేదా రాక్ ప్రిజర్వ్డ్ కాబట్టి వేలం వేయొద్దు అని పిటిషన్ వేశారు. 2003లో జీవో నెం. 4 ద్వారా నోటిఫై చేశారని తెలిపారు. హెరిటెజ్ పేరుతో ఉన్న 424 ఎకరాలు ఐటి పార్క్ కి కేటాయింపు, 2006 లోని జీవో నెం. 161 ప్రకారం చెరువు ఉందని, తోపో షీట్ ప్రకారం ఇక్కడ పచ్చదనం ఉండాలి. హైడ్రా బాషలో చెప్పాలి అంటే ఇదంతా ప్రభుత్వ భూమితో పాటు, గ్రీనరీ దీన్ని ఎవరు ముట్టుకోవద్దని స్పష్టం చేసింది. కానీ 2008 నుంచి 2010 వరకు నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన భూములు ఆలస్యం అయినా ఆ తర్వాత రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటిలో హెరిటేజ్ నిబంధన లేదు. కాని పదిన్నర ఎకరాల ప్రాంతానికి ఈ హెరిటేజ్ జీవో అడ్డు తగులుతుందా? లేదా అనేది తదుపరి ఉత్వర్వులకు లోబడి ఉండాలని హైకోర్టు మౌళిక ఆదేశాలు జారీ చేసి తుదపరి విచారణ 21కి వాయిదా వేసినట్లు సమాచారం.

**83/2లో కూడా పనులు**

ఇదే సర్వే నెంబర్‌లో ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వం ఫైట్ చేస్తోంది. ఇందులో 100 ఎకరాలు ఉంటుంది. కాని ఎప్పుడు ఛాన్స్ దొరికినా ప్రభుత్వ అధికారులతో తప్పుడు అఫిడవిట్స్ కోర్టుకు సమర్పించి ప్రైవేట్ పరం చేసేలా కుట్రలు జరుగుతున్నట్లు సమాచారం.

## జాతీయ జెండా.. మన ఆత్మగౌరవ ప్రతీక

- సుభాష్‌నగర్ ఆటోస్టాండ్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కుత్బుల్లాపూర్, నవతరం: జాతీయ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతీక అని సుభాష్‌నగర్ ఆటోస్టాండ్ అసోసియేషన్ అడ్వైజర్, సామాజిక కార్యకర్త మున్నంగి కిరణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆటోస్టాండ్ వద్ద నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అన్నారు. జాతీయ జెండాకు రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. 1947 జులై 22న రాజ్యాంగ సభ జాతీయ జెండాను అధికారికంగా ఆమోదించిందని గుర్తు చేశారు. మువ్వన్నెల పతాకంలోని కాషాయం త్యాగానికి, తెలుపు సత్యం, శాంతికి, ఆకుపచ్చ ప్రకృతి, అభివృద్ధికి ప్రతీకలని వివరించారు. మధ్యలోని అశోకచక్రం ధర్మానికి, నిరంతర గమనానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. త్రివర్ణ పతాకాన్ని చూసినప్పుడు కలిగే గర్వం కేవలం భావోద్వేగానికే పరిమితం కాకుండా.. దేశం పట్ల బాధ్యతగా మారాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ జాతీయ సమైక్యతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుభాష్‌నగర్ ఆటోస్టాండ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

**రెండవ పేజీ తరువాయి...** వాటిల్లింది. ఈ నేపథ్యంలో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఫైర్ ఇంజిన్ తో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు భారీగా చెలరేగడంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా కాలిపోయింది. అదేవిధంగా విలువైన గృహోపకరణాలు మంటల్లో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉంచిన రెండు తులాల 50 గ్రాముల బంగారు నగలు, 8 తులాల వెండి, రూ.28,000 నగదు, వస్తువులు,బట్టలు, ఫర్నీచర్ ఇంటిలోని సామాగ్రి అంతా మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఒంటిపై ఉన్న బట్టలతోనే మిగిలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో నిరుపేద కుటుంబానికి చెందిన మనోహర్ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ నేపథ్యంలో సంఘటన స్థలానికి కూకట్పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్) అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు (జనరల్ సెక్రటరీ) ఇంటిని పరిశీలించి రూ. 5000/- వేల రూపాయల చెక్కును మనోహర్ కి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ జర్నలిస్టు మిత్రులు, బిల్డర్లు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు మానవతా దృక్పథంతో స్పందించి, తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని పంపించి రిపోర్టర్ మనోహర్ కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కావున దాతలు కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అకౌంట్ నెంబర్ : 79086138295, IFSC Code: TGRB0000158 కి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

## హత్యకేసును 24గంటల్లో ఛేదించిన పోలీస్

- సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- ప్రధాన నిందితుడు మోతే పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న కానిస్టేబుల్ షరీఫ్..
- నేరానికి పాల్పడితే పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది అయినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన విలేకరుల సమావేశం
- కేసు దర్యాప్తు, అరెస్ట్ వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



సూర్యాపేట్, నవతరం: జిల్లా పరిధిలోని, మోతే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భార్య భర్తల జంట హత్యల కేసుకు సంబంధించి నేరానికి పాల్పడ్డ వారిని 24 గంటల్లోనే గుర్తించి అరెస్ట్ చేశామని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. మోతే మండల కేంద్రం జాతీయ రహదారి పక్కన మృతిదేహాలను పాక్షికంగా పూడ్చిపెట్టారు అని గురువారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సీఐ రామ కృష్ణ రెడ్డి, స్థానిక ఎస్ఐ లచ్చి రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక గ్రామ అధికారితో కలిసి మృతి దేహాలను వెలికి తీసి గుర్తించడం జరిగినది. ఎస్పీ నరసింహ సంఘటన స్థలానికి చేసుకుని పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణా రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ ను దర్యాప్తు





అధికారిగా నియమించాం.. అందుబాటులో ఉన్న సీసీటీవీ కెమెరాలు పరిశీలించగా రెండవ నిందితుడైన జిల్లేపల్లి సుందర్ మృతిచెందిన బూబా ను తీసుకెళుతూ అనామస్పదంగా కనిపించాడు. దీని ఆధారంగా దర్యాప్తు చేస్తున్న మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు ప్రత్యేక బృందం ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద మొదటి నిందితుడు షరీఫ్ ను, రెండవ నిందితుడు సుందర్ లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయడం జరిగినది. విచారించగా నేరాన్ని అంగీకరించారు. మోతే గ్రామానికి చెందిన సుందర్, పోలీసు స్టేషన్ కు వచ్చే పంచాయతీలు చేస్తూ మొదటి నిందితుడు షరీఫ్ కు పరిచయం అయ్యాడు, హత్యకు గురైన నాగులు, బూబా భార్యాభర్తలు సుందర్ ద్వారా షరీఫ్ కు పరిచయం అయ్యారు. ఈ పరిచయం సాన్నిహిత్యం ఏర్పడినది. భూబా, నాగులు దంపతులకు షరీఫ్ 3 లక్షల రూపాయలు ఇచ్చాడు, ఈ డబ్బులు అడిగే క్రమంలో భూబా, నాగులు దంపతులు షరీఫ్ ను బెదిరించగా వీరి అడ్డు తప్పించుకోవాలని పథకం పన్ని రెండవ నిందితుడు సుందర్ సహాయం తో హత్య చేసి పాతి పెట్టాడు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ..

- ఈ అర్ధరాత్రి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య సేవలు ప్రారంభం
- విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేత
- తొలి రోజు హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు 31 విమాన సర్వీసులు
- రికార్డు సమయంలో పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించారు
- ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో ఈ విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని అంచనా



**మిగతా వార్త కొరకు పక్కనున్న QR CODE స్కాన్ చేయండి**

భోగాపురం, నవతరం: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ అర్ధరాత్రి 12:01 గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com,
Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com